క్లుప్తంగా

డ్రైడేతో వ్యాధుల నుంచి రక్షణ



శిరివెళ్లలో డ్రైడేను పరిశీలిస్తున్న సీహెచ్ఓ

శిరివెళ్ల: ప్రతి ఇంట్లో శుక్రవారం డ్రైడేను పాటించాలని.. తద్వారా వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జెండాపేట, రెడ్డి పేటలో డ్రైడేను పరిశీలించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోళ్లు, కొబ్బరి చిప్పలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. ఇంటిలో నీటి నిల్వ ఉంచుకునే పాత్రలను వారంలో ఒక రోజు ఖాళీ చేసి ఆరనివ్వాలని తెలిపారు. దీని వల్ల దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్లను సంప్రదించి తగిన వైద్యం పొందాలన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సభలు



గ్రామంలోని రెవెన్యూ భూములను వివరిస్తున్న వీఆర్వో

దొర్నిపాడు: రైతులకు సంబంధించిన భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మాధవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రెవన్యూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. రైతుల సందేహాలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగప్రసాద్, ఈఓ చంద్రుడు, వీఆర్వో నాగేష్, ఏపీఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో..



పెద్దయమ్మనూరులో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ: రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దయమ్మనూరుగ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కేవలం భూ సమస్యలే కాకుండా గ్రామంలో ఏదైనా రస్తాలు, స్థల సమస్యలు, ఇతర వాటిపై దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గ్రామంలో 1226 మంది రైతులకు సంబంధించి 4,510 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. గ్రామ సభలో కేవలం ఒక మహిళా రైతు మాత్రమే అర్జీ ఇవ్వడం సరికాదన్నారు. భూ సమస్యలు ఉన్నప్పటికీ ఎందుక గ్రామ సభలను వినియోగించుకోవడం లేదని రైతులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వో వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు మూడు దరఖాస్తులు

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు స్పందన కరువవుతుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో అరకొరగా దరఖాస్తులు రావడంతో సదస్సుకు హాజరైన అధికారులు దరఖాస్తు దారుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. శుక్రవారం చాపిరేవుల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ ప్రియదర్శిణి మాట్లాడుతూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుపై దృష్టి సారించాలి

గోస్పాడు: రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుపై దృష్టి సారించాలని పశువైద్యాధికారి అబిలాష్‌రెడ్డి తెలిపారు. యాళ్లూరు పశువైద్య కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పశుపోషకులు బహువార్షిక పశుగ్రాసాలను సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. రైతులు వ్యక్తిగతంగా పది సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు సాగు చేసుకోవచ్చన్నారు. 5 ఎకరాల భూమి కలిగిన ఎస్సీ,ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ఈ అవకాశం ఉందన్నారు. జాబ్ కార్డు, పొలం 1బీ, ఆధార్, బ్యాంక్ పాసుబుక్, రేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు అప్లికేషన్ ఫారంను సంబంధిత రైతుసేవా కేంద్రంలో, సమీప పశువైద్యాధికారికి అందజేయాలని సూచించారు. అందుకు సంబంధించిన కూలీల వేతనం, మెటీరియల్ ఖర్చులు ఉపాధి హామీ పథకం కింద అందజేస్తారని వివరించారు. పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



దుకాణంలో ప్రదర్శనకు ఉంచిన తోరణాలు, స్టార్లు



ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఫైబర్ స్టార్



క్రిస్మస్ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

మార్కెట్‌కు క్రిస్మస్ కళ

- జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు
- ఈ ఏడాది ప్రత్యేకం.. ఫైబర్ స్టార్లు
- ఆకట్టుకుంటున్న మల్టీకలర్, గ్లాస్ స్టార్లు, బెలూన్ లైట్
- జోరందుకున్న కొనుగోళ్లు



అమ్మకాలకు ఉంచిన స్టార్లు

నంద్యాల(న్యూటౌన్): మరో నాలుగు రోజుల్లో క్రిస్మస్ పండుగ. ఇప్పటికే వ్యాపారులు పండుగకు అవసరమైన సామగ్రి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. వివిధ రకాలు, రంగులు, ఆధునిక మోడళ్లు తదితర వాటిని ప్రదర్శిస్తూ కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. కొన్ని రోజులుగా వ్యాపారులు లేక మార్కెట్ స్తబ్దుగా మారింది. ఈ క్రిస్మస్‌తోనైనా విక్రయాలు పెంచుకోవాలని విక్రయదారులు పోటీ పడుతున్నారు. పండుగకు ఉపయోగించే క్రిస్మస్ ట్రీ,స్టార్, రంగు రంగుల విద్యుత్ బల్బులు, డెకరేషన్ పేపర్లు, ఫ్లవర్లు, చర్చీలను అందంగా ముస్తాబు చేసేందుకు అవసరమైన సామగ్రి, గంటలు, క్రిస్మస్ తాత దుస్తులు, మాస్కుల విక్రయాలు ఊపందుకున్నాయి. సాధారణంగా వస్త్రాలు, చెప్పులు, ఫ్యాన్సీ వస్తువులు, గృహోపకరాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఎక్కువగా అమ్ముడుబోతాయి. ఇంటి అలంకరణకు సీరియల్ సెట్లు తదితరాలు తప్పక కొంటారని, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం వ్యాపారం బాగా జరుగుతుందనే ఆశ దుకాణదారుల్లో ఉంది. అందుకే పెద్ద మొత్తాలు వెచ్చించి భారీగా క్రిస్మస్ సామగ్రిని తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ నాలుగు రోజుల్లో ఒక్కో దుకాణంలో రోజకు రూ.50 వేలకు పైగా వ్యాపారం జరిగే అవకాశముందని చెబుతున్నారు.

మెరిసిపోతున్న దుకాణాలు..

వ్యాపారులు ఈ క్రిస్మస్ కోసం ఆకర్శణీయమైన సామగ్రిని అందుబాటులో ఉంచారు. వాటిలో బెలూన్ లైట్, గ్లాస్ స్టార్లు, శాండ్లియర్లు, మల్టీకలర్ స్టార్లు ఆకట్టుకుంటున్నాయి. పలురకాల క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు జననం, పాక దృశ్యాలు, బొమ్మల సెట్లు ఆకర్షిస్తున్నాయి. క్రిస్మస్ స్టార్లు రూ.100–రూ.800, క్రిస్మస్ ట్రీలు రూ. 150 నుంచి రూ.2వేలు, అలంకార సామగ్రి రూ.25 నుంచి రూ.500 వరకు, క్రిస్మస్ తాత డ్రస్ రూ. 200 నుంచి రూ.600, మాస్క్ రూ.50–150, సీరియల్ సెట్లు రూ.80 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.

ఫైబర్ తారలు ..

ఇన్నాళ్లు మనం చూస్తున్న తారలకు భిన్నంగా ఫైబర్ తారలు అందుబాటులోకి వచ్చాయి. ఫైబర్‌తో బాడీ రూపొందించిన ఈ తారలు విద్యుత్‌తో పలు రంగులు వెదజల్లుతాయి. సాధారణ స్టార్స్‌తో పోలిస్తే చాలా పలుచగా, తేలికగా ఉండడంతో ఈసారి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొనుగోలుదారులు ఈ తారలను దుకాణాల్లోనే పరిశీలించి మరీ కొంటున్నారు.



విద్యుద్దీపాలంకరణలో క్రిస్మస్ ట్రీ

వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవనగర్ రామాలయంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు జరిపించి, సుగంధ ద్రవ్యాలతో కూడిన పాలను 108 కలశాలలో నింపి వాటికి అర్చకులు వేదమంత్రాలతో పూజించి స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత స్వామి వారికి క్షీరాభిషేకం విశిష్టతను, వైభవాన్ని భక్తులకు వివరించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

నంద్యాల(న్యూటౌన్):నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బధిరుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు రవికృష్ణ, ఐ ఎం ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ విద్యార్థులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తామని, ఉచిత ఓపీడీ సేవలు పొందవచ్చన్నారు. త్వరలో నవజీవన్ పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాలు అందజేస్తామనిచెప్పారు.నర్మద, రవికాంత్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి,సురేంద్రారెడ్డి,భాగ్యలక్ష్మి,క్రాంతి పాల్గొన్నారు.

రూ. 36.50 లక్షలతో రహదారులకు మరమ్మతులు



పెద్దయమ్మనూరు సమీపంలో ప్యాచ్‌వర్క్ పనులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ఉన్న గుంతలను పూడ్చేందుకు రూ. 36.50 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆ శాఖ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు. ఉయ్యాలవాడ మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో 26 కిలోమీటర్ల పొడువున ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు రూ. 8.50 లక్షలు వ్యయం చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో 6వ కిలోమీటర్ నుంచి మాయలూరు 18 కి.మీ వరకు రూ. 4.50 లక్షలు, కోవెలకుంట్ల, జమ్మలమడుగు ప్రధాన రహదారి నుంచి ఒంటెద్దుపల్లె వరకు రూ. 4.50 లక్షలు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల రోడ్డుకు రూ. 4.50 లక్షలు, గుళ్లదుర్తి, హరివరం రోడ్డుకు రూ. 3.50 లక్షలు, పెద్దయమ్మనూరు, కాకరవాడ రోడ్డుకు రూ. 5 లక్షలు, అలాగే కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ సెక్షన్ పరిధిలోని 100 కిలో మీటర్ల రహదారులకు ఇరు వైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించేందుకు రూ. 6 లక్షలు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఆ రహదారుల్లో పనులు జరుగుతున్నట్లు డీఈ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామ శివారులో శుక్రవారం దాడులు నిర్వహించి 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సీఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. సుగాలిమెట్ట కొండ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారన్నారు. అలాగే గడివేముల మండలం తిరుపాడులో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాడుల్లో ఎస్‌ఐలు బ్రహ్మయ్య, శ్రీనివాసులు సిబ్బంది రమణ, ప్రకాష్, విజయుడు, సుధాకర్, ఫరూక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి




మహా కుంభమేళాకు కంచాలు అందజేస్తున్న సభ్యులు

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళికామాత దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. హరిత కుంభమేళా ఉత్సవాల సందర్భంగా స్థానిక కాళికామాత దేవాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దాతలు కంచాలను, బ్యాగులను అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కుంభమేళాలో ప్లాస్టిక్ వస్తువులను నివారించేందుకు వీటిని అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కుంభమేళా పర్యావరణ సంరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

నంద్యాల(అర్బన్): చిన్నచిన్న మరమ్మతుల పేరుతో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డి1, డి2, డి3తో పాటు రూరల్ ప్రాంతాలకు చెందిన విద్యుత్ సబ్ స్టేషన్లు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. వర్షాలు, ఉరుములు, మబ్బులు లేకపోయినా ఎప్పుడు పడితే అప్పుడు గంటల తరబడి కోతలు విధిస్తుండటం, విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక సతమతమవుతున్నారు. చిన్న పాటి తీగ తెగిపడినా సిబ్బంది నిర్లక్ష్యంతో గంటల గరబడి ప్రజలు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల వర్షాలు లేకపోయినా వార్డుల వారీగా విడతల విడతలుగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



అప్పనపల్లె వద్ద కోతకు గురైన 19వ బ్లాక్ కాల్వ

పొంచి ఉన్న ప్రమాదం

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె వద్ద తెలుగుగంగ 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ కట్ట ప్రమాదకరంగా మారింది. ఎడ్ల బండ్లు, వాహనదారులు అటువైపు వేళ్లే సమయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు ఇరు వైపులా అప్పనపల్లె రైతుల పొలాలు ఉన్నాయి. ఆ కట్టల మీదుగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం కాండ్లు, ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు వంటి వాహనాలతో రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో కాల్వపై రాకపోకలు సులువుగా సాగేవి. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో పాటు అధికారులు తెలుగుగంగ కాల్వలకు అధిక మోతాదులో సాగు నీటిని విడుదల చేశారు. దీంతో కాల్వలో నీటి ప్రవాహం తీవ్రమైంది. ఆ ప్రవాహానికి తాళలేక అప్పనపల్లె నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వ వైపు వెళ్లే దారిలో 19వ బ్లాక్ కాల్వకట్ట కోతకు గురైంది. దీంతో ప్రమాదకరంగా మారింది. కాల్వకట్ట కోతకు గురై నెలలు గడుస్తున్నా టీజీపీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాటికి తోడు దారులు కూడా ప్రమాదకరంగా మారితే పొలాలకు వెళ్లి పంటలు ఎలా పండించుకోవాలని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టీజీపీ అధికారులు స్పందించి కోతకు గురైన 19వ బ్లాక్ కాల్వ కట్టకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో క్యాండిల్ లైట్ సర్వీసు





మాట్లాడుతున్న డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ జార్జి కొర్నెలి, క్యాండిల్ లైట్ సర్వీసులో పాల్గొన్న క్రైస్తవులు,

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్ద చర్చి) నందు శుక్రవారం రాత్రి క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టరేట్-1 డీనరీ ఛైర్మన్ రెవరెండ్ కొత్తమాసీ జోసెఫ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ జార్జి కొర్నెలి పాల్గొని క్రైస్తవులకు దైవసందేశాన్ని అందించారు. అనంతరం క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక భక్తి గీతాలు అలరించాయి. గురువులతో పాటు సెక్రటరీ ప్రభుదాసు, స్టీఫెన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ జూనియర్ కళాశాలలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శిరోమణి పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ప్రిన్సిపాల్ దివాకర్ మాట్లాడుతూ శాంతక్లాస్ చూపిన మార్గాన్ని అనుసరిస్తున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సత్యసులోచన, నళిని, కెజియా, నవీన, మధు, శేఖర్, షాహిన్, హుసేన్ పాల్గొన్నారు. అలాగే..పట్టణ సమీపంలోనున్న వైఎస్సార్‌నగర్‌లోని బుడగజంగాల కాలనీలో సర్వకృపానిధి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఇమ్మానియేల్, సురేష్, జేమ్స్, జోసెఫ్, సామియేలు పాల్గొన్నారు.

అ‘భయమేనా’..?

- విస్తారంగా వరినార్లు
- ప్రజా ప్రతినిధులు, అధికారుల నుంచి నీటి విడుదలపై స్పష్టత కరువు



వెంకటేశ్వనగరంలో కేసీ కింద రబీకి సిద్ధంగా నారు



చురుగ్గా సాగుతున్న వరికోత పనులు

దొర్నిపాడు: ఖరీఫ్‌లో సాగుచేసిన వరి రైతులకు ఆశించినంత దిగుబడులు వచ్చినా గిట్టుబాటు ధర లేకపోవడంతో కుదేలయ్యారు. ఎకరానికి 40 బస్తాలకుపైగా ధాన్యం వచ్చినా ధర మాత్రం రూ.1500లోపే ఉండడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఒకవైపు కోతలు ముమ్మరం చేసి మరో వైపు రబీలో తిరిగి వరిని సాగు చేసేందుకు కేసీ కెనాల్ వెంట విస్తారంగా నార్లు పోశారు. కనీసం రబీ అయినా అనుకూలిస్తుందో లేదోనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రబీకి సన్నద్ధం

ఖరీఫ్ రైతులకు అనుకూలంగా లేకపోవడంతో రబీ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. కానీ ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. తీరా నాట్లు వేశాక నీరు అందకపోతే రైతుల పరిస్థితి ఏంటి. ప్రతి ఏటా కేసి కింద 1,035 హెక్టార్లకు పైగా వరిని సాగు చేస్తారు.

గతేడాది భరోసా

గతేడాది అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏపీ జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు లేకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి విడతల వారీగా సాగునీరు తెప్పించారు. ఎండు దశలో ఉన్న జొన్న, పత్తి, వరి, మినుము పంటలు చేతికి వచ్చేలా కృషి చేశారు. అప్పటి రోజులను రైతులు ఇప్పటికి నెమరు వేసుకుని సంతోషిస్తున్నారు. ప్రస్తుతం అలాంటి భరోసా దొరకడం లేదని రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పటికే మొదటి పంటలో నష్టపోయిన రైతులు రెండో పంటతో గట్టెక్కలని ఆశిస్తున్నారు.

సాగునీరు వదిలితే బాగుంటుంది



ఖరీఫ్‌లో మంచి దిగుబడులు వచ్చినా ఆశించిన ధర లేదు. దీంతో రబీని నమ్ముకుని వరినారు పోశాం. అధికారులు రెండో పంటకు సాగునీరు వదిలితే బాగుంటుంది. అంతేగాక ఈసారి వర్షాలు వరుస పెట్టి కురువడంతో బాగా దెబ్బతిన్నాం. అధికారులు రైతులకు భరోసా ఇస్తే ధైర్యంగా ఉంటుంది.

–రాఘవేంద్ర, వెంకటేశ్వనగరం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నగరి శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె.సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘానికి తక్షణమే కమిషనర్‌ను నియమించాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐలోన్లు సరండర్ లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఉత్తర్వులు 72, 73, 74 అమలు చేస్తూ జూనియర్ కాలేజీ, డైట్ కాలేజీ లెక్చరర్ల పదోన్నతులు పాఠశాల సహాయకుల ద్వారా, ఉప విద్యాశాఖ అధికారి పోస్టులను సీనియర్ ప్రధానోపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఏపీటీ ఎఫ్ కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయరాం, గోపాల్, శిరివెళ్ల కార్యదర్శి నగిరి వెంకటేశ్వర్లు, మానపాటి రవి,పవన్‌కుమార్, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు



గాయపడిన పోటే నాయక్

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ మజరా గ్రామమైన ఎం.తండాలో శుక్రవారం ఉదయం బుక్కె పోటేనాయక్‌పై అదే గ్రామానికి చెందిన శివరాం నాయక్ మంచం కోడెతో దాడికి పాల్పడ్డాడు. కుడి చేతికి తీవ్ర గాయం కావడంతో కడపలోకి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చాగలమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. బైక్ విషయంలో గొడవ జరగడంతో దాడి జరిగినట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.